క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లి గ్రామంలో నిర్మించనున్న షిరిడి సాయిబాబా ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా గొల్ల శేషయ్య, కోశాధికారిగా నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, సాయిబాబా, దేవన్న, అంజనేయులు, సత్యనారాయణ, శంకర్, లోకేష్‌గౌడ్, శ్రీను తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి సేకరించిన రూ.15లక్షల చెక్కును స్థానిక సర్పంచ్ నిర్మల నూతన కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. గ్రామస్తులు కాశీనాథ్ సాగర్, ఉప సర్పంచ్ విజయ్ తదితరులు ఉన్నారు.

టైర్ పగిలి మినీట్రక్ బోల్తా

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై మినీ ట్రక్ బోల్తాపడిన ఘటనలో అదృష్టవశాత్తు ఇద్దరికి ముప్పు తప్పింది. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన సురేందర్, మరో వ్యక్తి కలిసి మినీ ట్రక్‌లో వనపర్తి, కొత్తకోటకు చాక్లెట్లను తీసుకెళ్తున్నారు. మూసాపేట స్టేజీ దాటిన తర్వాత రైస్‌మిల్లు ముందు ట్రక్ వెనుక టైరు పగిలిపోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఘటనలో సురేందర్, మరో వ్యక్తి త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కాగా వాహనంలో ఉన్న చాక్లెట్ల బాక్సులు రోడ్డుపై పడిపోయాయి. పోలీసులు వచ్చి ఎల్‌అండ్‌టీ క్రేన్ సాయంతో ట్రక్‌ను రోడ్డు పక్కకు తీయించారు. మరో వాహనంలో చాక్లెట్లను వేసుకుని మహబూబ్‌నగర్ తీసుకెళ్లారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వివరించారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

గండీడ్: పాత పింఛన్ విధానం వెంటనే పునరుద్ధరించి అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ డిమాండ్ చేశారు. చిన్నవార్వాల్, రుసుంపల్లి యూపీఎస్‌లలో సోమవారం పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈనెల16 నుంచి సంకల్ప రథయాత్ర ప్రారంభం కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కుర్మయ్య, నర్సింహారెడ్డి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం వెలుగుతున్న వీధిదీపాలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వార్డు నం.9 లోని భాగ్యనగర్‌కాలనీ, హీరాబాయినగర్, పాల్కొండతండా, ధనలక్ష్మి కాలనీల్లో మూడు రోజుల నుంచి 24 గంటలూ వీధి దీపాలు వెలుగుతున్నాయి. వాస్తవానికి సాయంత్రం 6 నుంచి 6 ఆరుగంటల వరకు మాత్రమే వెలగాల్సి ఉంది. కానీ మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్‌వృథా అవుతోంది. ఇప్పటికే ప్రతినెలా ట్రాన్స్‌కోకు మున్సిపల్ అధికారులు రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్కడికక్కడ ఆన్ ఆఫ్ స్విచ్‌లతో పాటు మూడో వైరు ఏర్పాటు చేసి రాత్రివేళ మాత్రమే వీధి దీపాలు వెలిగేలా చూడాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

'మల్టీపర్పస్' కష్టాలు భరించలేం



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా అమలు చేస్తున్న మల్టీపర్పస్ విధానంలో గ్రామపంచాయతీ కార్మికులతో గొడ్డు చాకిరీ చేయిస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి పి.సురేష్ ధ్వజమెత్తారు. కార్మికుల నిరవధిక సమ్మె సోమవారం కొనసాగిన సందర్భంగా పాల్గొని మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల: మండలంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య నాయకులు కృష్ణయ్య, శేఖర్ పాల్గొన్నారు.

నవాబుపేట: పీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ మండలంలో సోమవారం సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. పీసీసీ అధికారప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ఉపాధ్యాక్షుడు రంగారావు, ప్రధాన కార్యదర్శి బంగ్లారవి తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: మండలంలో అధ్యక్షుడు జంగయ్య, తిరుపతయ్య, మల్లేష్, సాయి పాల్గొన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలో సమ్మెకు సర్పంచ్ విజయలక్ష్మి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు శంకర్‌నాయక్, తిరుపతి, నారాయణ సైతం మద్దతుగా నిలుస్తామని అన్నారు.

హన్వాడ: మండలంలో పంచాయతీ కార్మికులు వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. 35గ్రామ పంచాయతీల కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



అంతా లోతట్టు ప్రాంతమే!

- వర్షం కురిస్తే వీధులన్నీ జలమయం
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న మురుగు

24వ వార్డులో జనాభా: 6,287
ప్రధాన వీధులు: రామయ్యబౌలి(కొంత భాగం), తయ్యబ్‌నగర్, శివశక్తినగర్ (కొంత భాగం)

వార్డ్ వాచ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 24వ వార్డులో సమస్యలు తిష్ట వేశాయి. రామయ్యబౌలి, తయ్యబ్‌నగర్, శివశక్తినగర్‌లోని కొంత భాగం మొత్తం లోతట్టు ప్రాంతంలో ఉన్నాయి. చాలా వరకు సీసీరోడ్లు ఉన్నా పాత డ్రెయినేజీలే దిక్కయ్యాయి. ఓపెన్ ప్లాట్లలన్నీ చెత్త, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వర్షాకాలం ఆరంభం కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ అన్ని గల్లీలలో వరదతో పాటు మురుగు కలిసి పారుతోందని వాపోతున్నారు. డ్రెయినేజీలు చిన్నవి కావడంతో ఎక్కడికక్కడ నిండిపోతాయన్నారు. ముంపు బారినుంచి బయటపడేందుకు పెద్దచెరువు అలుగు నుంచి చేపట్టిన నాలా (భూగర్భ డ్రెయినేజీ) పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తయ్యబ్‌నగర్‌లో ఇటీవల మిషన్ భగీరథ పైపులైన్‌ను అర కిలోమీటరు మేర విస్తరించారు. గుంతలు సరిగా పూడ్చక పోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గల్లీలలో ఇంకా మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఫంక్షన్ హాలు చుట్టు పక్కల డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. శిల్పారామం వెనుకభాగంలో ఉన్న ఓ గల్లీలోని ముఖ్యకూడలిలో చుట్టుపక్కలవారు చెత్త విద్యుత్ స్తంభం వద్ద వేస్తున్నారు. రామయ్యబౌలి తదితరచోట్లా పరిస్థితి అధ్వానంగా ఉంది. మదర్సా సమీపంలోని రెండు గల్లీలలో విద్యుత్ స్తంభాలకున్న తీగలు కిందకు వేలాడుతున్నాయి. కుక్కల బెడద సైతం తీవ్రంగా ఉండడంతో జంకుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



మదర్సా వెనుక భాగంలోని గల్లీలో వేలాడుతున్న విద్యుత్ తీగలు, లైట్



తయ్యబ్‌నగర్‌లోని ఓ గల్లీలో మిషన్ భగీరథ పైపులైన్ వేసి నడిరోడ్డులో సరిగా పూడ్చని వైనం

ఇబ్బందులు పడుతున్నాం



మా కాలనీలోని ముఖ్యకూడలిలో చుట్టుపక్కలవారు చెత్త వేస్తున్నారు. దుర్గంధం వ్యాపిస్తోంది. తరచూ అనారోగ్యం పాలవుతున్నాం. పెద్ద మోరీపై ఉన్న కాజ్‌వే ఎత్తును పెంచాలి. వీధి లైట్లు సరిగా వెలగడం లేదు. శిల్పారామం వెనుక భాగంలోని గల్లీల్లో నెల రోజుల క్రితమే మిషన్ భగీరథ పథకం పైపులైన్ వేశారు. సీసీరోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలు పరిష్కరించాలి.

– ఎండీ షహీద్ హుస్సేన్, తయ్యబ్‌నగర్

వీధికుక్కలతో వేగలేకపోతున్నాం



గల్లీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మదర్సా వెనుక భాగంలోని గల్లీ మలుపులో వీధి స్తంభానికున్న లైటు పడిపోయింది. రెండు, మూడు గల్లీలలో విద్యుత్ స్తంభాలకున్న తీగలు కిందికి వేలాడుతున్నాయి. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం వస్తే వీధులన్నీ జలమయమవుతాయి. ఓపెన్ ప్లాట్లలో చెత్త వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలి.

– మహ్మద్ సన్నాన్, రామయ్యబౌలి

రూ.90 లక్షలతో పనులు



మూడున్నరేళ్ల కాలంలో సుమారు రూ.90 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. లోతట్టు ప్రాంతం కావడంతో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులతో వరద, మురుగును తొలగింపజేస్తున్నాం. ఇటీవలే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో పనుల కోసం రూ.కోటి మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. మరో రూ.50 లక్షలు కేటాయిస్తే మిగిలినవి పూర్తిచేసే అవకాశం ఉంటుంది.

– మహ్మద్ అబ్దుల్ రషీద్, 24వ వార్డు కౌన్సిలర్

వైభవంగా పోచమ్మ బోనాలు

మిడ్జిల్: వేములలో గ్రామ దేవత పోచమ్మ బోనాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల కోసం సర్పంచ్ జంగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎంపీటీసీ యశోద, గ్రామ పెద్దలు భీంరాజ్, చెన్నయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎదిర వేడుకలో డోలు వాయిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అమ్మవారి ఆశీస్సులు పొందాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రార్థించారు. సోమవారం సాయంత్రం వార్డు నం.4 పరిధిలోని ఎదిరలో బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారు మైసమ్మ మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు రూ.పది లక్షలతో నిర్మించనున్న ఆలయం ప్రహరీ పనులను ప్రారంభించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఏటా కురువ సోదరుల ఆధ్వర్యంలో వైభవంగా ఈ బోనాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో షెడ్ నిర్మాణానికి రూ.పది లక్షలు మంజూరు చేస్తామన్నారు. కాగా, అధిక సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయం వరకు చేరుకుని నైవేద్యా సమర్పించారు. కొద్దిసేపు మంత్రి బోనం ఎత్తుకోవడమే గాక కళాకారులతో కలిసి డోలు వాయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తోకల యాదమ్మ, బీఆర్ఎస్ నాయకుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



వేములలో బోనాల ఊరేగింపు

చిన్నదేశాలు ఎంతో అభివృద్ధి చెందాయి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మన దేశం కంటే వైశాల్యంలో ఎంతో చిన్న చిన్న దేశాలు సైతం ఎంతో అభివృద్ధి చెందాయని, కానీ భారత్ ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉండిపోయిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరువల్లే ఇలాంటి పరిస్థితి ఉందని ఆరోపించారు. సోమవారం వీరన్నపేట నీలకంఠ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. ఇటీవల దక్షిణ కొరియాలో అధికారిక పర్యటన చేశామన్నారు. ఒకప్పుడు ఎంతో వెనుబడి ఉన్న ఆ దేశం ఆర్థికశక్తిలో నేడు ప్రపంచంలోనే టాప్‌టెన్‌లో ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని వీరన్నపేట, టీడీగుట్ట వంటి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. శివరాజు, జ్యోతి, రామలింగం, రాములు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోటకదిరకు చెందిన వ్యవసాయ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ నర్సిములును మంత్రి పరామర్శించారు.

నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యం



బాలానగర్: విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచడం, నైపుణ్యాలను పెంపొందించడం కోసమే ఈ నెల 15 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఏఎంఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కస్తుర్బాతో పాటు, అమ్మపల్లి, తిరుమలకుంట, పలుగుమీది తండా తదితర పాఠశాలలను జీసీడీఓ పల్లవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వారోత్సవాల్లో పోస్టర్ల ఏర్పాటు, ర్యాలీ, పుస్తకాల సేకరణ, పఠన సామగ్రి సేకరణ, దినపత్రికల్లో వచ్చే వార్తల సేకరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 15న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఉంటుందన్నారు. కస్తూర్బాలో విద్యార్థులకు అందించే భోజనం పై ఆరా తీశారు.

గాధిర్యాల్‌లో అటవీభూముల పరిశీలన

మహమ్మదాబాద్: తమపేరున పట్టాలు ఉన్నాయంటూ, ఎలాంటి అనుమతి లేకుండా కబ్జాలు చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో సోమవారం అటవీశాఖ అధికారులు భూములను పరిశీలించారు. మహమ్మదాబాద్ రేంజ్ అధికారి మగ్దూమ్ హుస్సేన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. రైతులతో మాట్లాడారు. కాగా సంబంధిత రైతులు తమకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తమ పొలాలకు దగ్గర్లో బీడు భూములు ఉన్నందున వ్యవసాయ పొలాలుగా చేసుకుంటున్నామని తెలిపారు. అటవీకి సంబంధించిన చెట్లను ఇప్పుడు నరకలేదని నిత్యం అటవీశాఖ అధికారులు అన్నీ చూస్తూనే ఉన్నారని ఎప్పుడూ అభ్యంతరం తెలపలేదని అన్నారు. 70 సర్వేనంబరులో తమ పొలాలను సాగులోకి తెచ్చుకుంటున్నామని వివరించారు. కాగా అధికారులు ఏడీ సర్వే చేసుకున్న అనంతరం తమ భూములని తేలితేనే సాగు చేసుకోవాలని సూచించారు. అప్పటివరకు ప్రభుత్వ భూముల జోలికి వెళ్లవద్దని సూచించారు. కలప నరికితే ఫైన్లు, కేసులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓలు సుమలత, తాజోద్దీన్ తదితరులు ఉన్నారు.



భూములను పరిశీలిస్తున్న అధికారులు

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు



చౌడాయపల్లిలో మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: పని చేయని వాళ్లే ఎక్కువ మాటలు చెబుతారని, అందుకే ప్రతిపక్షాలు చెప్పే తప్పుడు మాటలను నమ్మవద్దని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందూర్, చౌడాయపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కందూర్‌లో గౌడ సామూహిక భవనం, రజక సమూహిక భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా నిర్మాణం పూర్తి చేసుకున్న మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. చౌడాయపల్లి గ్రామంలో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో మహిళలనుద్దేశించి మాట్లాడుతూ పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకొనే విధంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోసారి సీఎం కేసీఆర్‌కు మద్దతునివ్వాలని కోరారు. తెలంగాణ రాకముందు పదేళ్ల పాటు అధికారంలో ఉండి సాగు, తాగునీరు తెచ్చే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం మొదలు పెట్టాయని, వాటిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని సూచించారు. చౌడాయపల్లికి చెందిన 16 మహిళా సంఘాలకు రూ.కోటిన్నర రుణాలను పంపిణీ చేశారు. రైతు మన్నెంకొండ సాగు చేసిన బీరకాయ పంటను పరిశీలించారు. కందూర్, చౌడాయపల్లి గ్రామాల మహిళా సంఘం భవనాల్లో ఫర్నిచర్ ఏర్పాటుకు ఒక్కో గ్రామానికి రూ.15వేల తన సొంత డబ్బులను అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు శ్రీకాంత్, జయన్న, ఆంజనేయులు, ఎంపీటీసీ శ్యామలమ్మ, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్, మండల కోఆప్షన్ ఖాజాఫొరీ, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన గుడ్ల పంపిణీపై ఆరా

సాక్షి ఎఫెక్ట్..

మహమ్మదాబాద్: 'అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్లు' అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. మండలపరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా ఐసీడీఎస్ అధికారులు తనిఖీచేశారు. కేంద్రంలో కుళ్లిన గుడ్ల సరఫరాపై ఆరా తీశారు. అదేవిధంగా చిన్నారులకు పంపిణీ చేస్తున్న వివిధ పౌష్టికాహారాలను సూపర్‌వైజర్ మల్లమ్మ తనిఖీ చేశారు. కుళ్లిన గుడ్ల సరఫరా విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ మల్లమ్మ

స్థలాలను పరిరక్షించాలి

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో గల పది శాతం స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ రాజు సోమవారం కమిషనర్ మహ్మద్ షేక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.ఈమేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థలాలకు కంచె ఏర్పాటు చేస్తామన్న అధికారులు ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదన్నారు. పలు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని పేర్కొన్నారు. చర్యలు చేపట్టాలని లేనిచో 21న రిలే నిరాహార దీక్ష చేపడతామన్నారు.

అనుమానితులతో జాగ్రత్తగా వ్యవహరించాలి

జడ్చర్ల: గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ రమేష్ బాబు తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక ఎర్రగుట్ట ప్రాంతంలో కాలనీ వాసులకు పోలీసులు అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,సైబర్ నేరాలు, మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. 100 డయల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతిఇంటికీ సంక్షేమఫలాలు



మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి పల్లెకు అభివృద్ధి, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఓబ్లాయిపల్లి సర్పంచ్ చంద్రకళ అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. నాయకులు వెంకటస్వామి, అంజన్‌కుమార్, శ్రీనివాసులు, ఆంజనేయులు, సుదర్శన్, రాకేష్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గండీడ్: రైతుబీమాకు అర్హులయిన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీషా తెలిపారు. 2023 జూన్ 18లోపు పాసుపుస్తకాలు పొందిన వారు అర్హులని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు వారికి అవకాశం ఉంటుందన్నారు. ఆగస్టు 5 చివరి తేదీ అని సూచించారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

భూత్పూర్: ఆయిల్ పామ్ సాగుకు సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సోమవారం మండల వ్యవసాయాధికారి మురళీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 90 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఏఈఓలను సంప్రదించాలని కోరారు.

సన్మార్గంలో నడిస్తే చక్కని భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది శివారులోని కస్తూర్బాలో సోమవారం సురక్ష పోలీసు కళాబృందం మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో బాలికలకు సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షీ టీమ్స్, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, సురక్ష పోలీసు కళాబృందం సభ్యులు ఆటాపాటలతో బాలికలకు అవగాహన కల్పించారు. శ్రద్ధగా చదువుకుని సన్మార్గంలో నడిస్తే చక్కని భవిష్యత్ ఉంటుందని వివరించారు. కానిస్టేబుల్స్ రఘు, వై.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

కోయిల్‌కొండ: రాబోయే ఎన్నికల్లో పేటలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్లాబాద్, సూరారం, మణికొండ తదితర గ్రామాలకు చెందిన వందమందికి పైగా ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందన్నారు. అదేవిధంగా మండల అధ్యక్షుడిగా జి.రవీందర్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా వై.విద్యాసాగర్‌గౌడ్ నియామకంపై ప్రతిపాదనలు పంపుతున్నట్లు వివరించారు. నాయకులు మహేందర్‌గౌడ్, రవినాయక్, రామస్వామి, చందాపూర్‌కృష్ణ, ఆశిరెడ్డి, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

వైభవంగా గంధోత్సవం



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో వడ్డెన్న గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. సయ్యద్ శమీం ఇంటి నుంచి గంధం ఊరేంగిపుగా దర్గా వద్దకు తీసుకువెళ్లారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవానికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

గండీడ్: నులిపురుగుల నివారణకు కృషి చేయాలని మండల వైద్యాధికారి చంద్రశేఖర్ సూచించారు. సోమవారం కార్యక్రమ నిర్వహణపై మండల అధికారులు ప్రత్యేక సమావేశమయ్యారు. నులిపురుగుల నివారణ మాత్రలను ప్రతిఒక్కరికీ పంపిణీ చేయాలని సూచించారు. ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ

జడ్చర్ల టౌన్: కహూత్ క్విజ్‌స్పిక్ ఏథోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి క్విజ్ పోటీలలో స్వామినారాయణ్ గురుకుల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 8వ తరగతి విద్యార్థి దివ్యాంశ్ ప్రథమస్థానం పొందాడు. ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

పూర్వ విద్యార్థికి వీసీ అభినందన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మాథ్స్ డిపార్ట్‌మెంట్‌లో గత విద్యాసంవత్సరంలో గోల్డు మెడల్ సాధించిన వసంతాదేవిని వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అభినందించారు. ఇటీవల విద్యార్థినిని విద్యాశాఖ మంత్రి సన్మానించిన నేపథ్యంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ పీయూ విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం గొప్పవిషయం అన్నారు. రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.